దాతల సాయంతో ఆలయ అభివృద్ధి



ప్రసన్న వేంకటేశ్వరాలయం చుట్టూ రక్షణ గోడ నిర్మాణ పనులు



భెల్ సిగ్నల్ పాయింట్ వద్దనున్న ప్రసన్న వేంకటేశ్వర, వినాయక స్వామి వార్ల ఆలయం

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్దనున్న ప్రసన్న వేంకటేశ్వరాలయ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాతలు పలు రూపాల్లో సహాయ సహకారాలు అందించడంతో ఆలయానికి అవసరమైన నిర్మాణాలు చేపడుతున్నారు. ఆలయంలో వేంకటేశుడి కల్యాణోత్సవాలు, ఇతర పండగ సమయాల్లో పూజా కార్యక్రమాలకు అనుకూలంగా ఆలయం చుట్టూ షెడ్లు నిర్మించారు. మార్బుల్స్‌తో గచ్చులు వేశారు. భక్తులు ఆలయ ప్రదక్షిణ సమయంలో ఎండా, వానకు ఇబ్బంది పడకుండా శాశ్వత ఏర్పాట్లు చేశారు. అలయ ప్రవేశంలో బాలగణపతి మందిరాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. పటిష్ట రక్షణలో భాగంగా ఆలయానికి స్టీల్ గేట్లు బిగించారు. ప్రసన్న గిరి కొండ పైనున్న ప్రసన్న వేంటేశ్వరాలయానికి కూడా స్టీల్ గేట్లను ఏర్పాటు చేశారు. మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్న వారికి ఇప్పటికే నడక దారి అందుబాటులో ఉంది. ఆటో నగర్‌కు చెందిన శ్రీ వెంకటరమణ పైపుల యజమాని నాగిరెడ్డి ఆర్థిక సాయంతో ఆలయ ధ్వజస్తంభం ఎదురుగా నూతన మెట్ల మార్గం నిర్మించి, మార్బుల్స్ వేస్తున్నారు. ఈ పనుల్ని దాతే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పాతగాజువాకకు చెందిన కార్తికేయ స్టీల్స్ వారి ఆర్థిక సహకారంతో వినాయకుని ఆలయం ముందు పార్కింగ్ స్థలానికి ఆనుకుని రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. ఆలయ అభివృద్ధి పనుల్ని ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు గంగ్రెడ్డి రామునాయుడు, కమిటీ సభ్యుడు బొడ్డేడ అచ్చిలినాయుడు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.



ఆలయ ధ్వజ స్తంభం ముందు మార్బుల్స్‌తో మెట్ల నిర్మాణం

స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులకు సత్కారం



స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేయనున్న ఉద్యోగులను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: పదవీ విరమణ చేస్తున్న స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలను శుక్రవారం సత్కరించారు. శనివారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్ అధ్యక్షతన సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. బీఎంకే నాయక్, కె. ఫణిరాజు, కాకర నాగేశ్వరరావు, సాగి సీతారామరాజు, గోపిశెట్టి వెంకటరావు, రామచంద్రరాజులను శాలువాలు కప్పి, పూలమాలలతో అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఇటీవల కాలంలో పదవీ విరమణలు పెరిగాయన్నారు. ఈ నెలలో ఐఎన్‌టీయూసీకి చెందిన తొమ్మిది మంది పదవీ విరమణ చేయడం యూనియన్‌కు పెద్ద నష్టమన్నారు. పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా ఏర్పాటు చేసిన కొమ్ము ప్రసాద్‌ను అభినందించారు. చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు మాట్లాడుతూ పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగుల సేవలు విశిష్టమైనవన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వి. నగేష్, కారు రమణ, ప్రభాకరరెడ్డి, పి.వి. రమణమూర్తి, ఆర్. కోటేశ్వరరావు, బి.ఎస్. రాజు, డి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్లను నిలిపేస్తే ఆందోళన తప్పదు



ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ క్యాంటీన్లకు అంతరాయం ఏర్పడితే ఆందోళన చేస్తామని స్టీల్‌ప్లాంట్ క్యాంటీన్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ హెచ్చరించారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈడీ(వర్క్స్) బిల్డింగ్ వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. క్యాంటీన్ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో జూలై నుంచి నాలుగు జోన్లలోని క్యాంటీన్లు మూత పడనున్నాయన్నారు. పర్మినెంట్ కార్మికులకు భోజనాలు, టీ, టిఫిన్‌లు లేకుండా ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. ప్రధాన కార్యదర్శి పి.నారాయణరావు మాట్లాడుతూ క్యాంటీన్ల నిర్వహణకు ఆటంకం లేకుండా, కార్మికుల ఉపాధికి భంగం కలగకుండా చూడాలని కోరారు. జీఎం (హెచ్‌ఆర్) ఎస్.భాను మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లుల విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.కన్నబాబు, ఆదిరెడ్డి శ్రీను, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముసుగు తొలగించరూ?



బర్మా కాలనీలో ముసుగు తొలగించకుండా ఉన్న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం

పెదగంట్యాడ : జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బర్మా కాలనీలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎన్నికల కోడ్ ముగిసినా ఇంకా ముసుగు తీయలేదు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆ విగ్రహానికి జీవీఎంసీ అధికారులు ముసుగు తొడిగారు. ఎన్నికల కోడ్ ముగిసినా ముసుగు తొలగించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి ముసుగు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు అభాగ్యురాలు



పద్మను ఆమె కుమార్తెకు అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

అల్లిపురం : రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తున్న 60 ఏళ్ల పద్మ అనే మహిళను ఆర్పీఎఫ్, ఏయూటీడీ సిబ్బంది సంయుక్తంగా ఈ నెల 14వ తేదీన అదుపులోకి తీసుకున్నారు. ఆమెను జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి తరలించి ఆశ్రయం కల్పించారు. ఆమె నుంచి వివరాలు సేకరించారు. ఆమెది గాజువాక దరి గంట్యాడ అని తెలియజేయడంతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు శుక్రవారం ఆమెను వ్యానులో తీసుకెళ్లి ఆమె కుమార్తెకు అప్పగించారు. ఆమె మానసిక స్థితి బాగులేదని, ఊరూరా తిరుగుతుందని పద్మ కుమార్తె తెలిపింది. ఆమెకు పింఛన్ కూడా వస్తుందని తెలియజేసింది. ఆమెను ఇల్లు కదలకుండా చూసుకోవాలని వాసు పద్మ కుమార్తెకు సూచించారు.

ఇసుక డిపోలకు ఇన్‌చార్జిల నియామకం



అగనంపూడి ఇసుక డిపో

అగనంపూడి : గాజువాక మండలం అగనంపూడిలోని ఇసుక డిపోలకు గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి ఇన్‌చార్జిలను నియమించారు. ఈ మేరకు ఆమె ఇసుక స్టాక్ యార్డ్‌ను పరిశీలించి వీఆర్‌వోలకు విధులు కేటాయించారు. 24 గంటలు అందుబాటులో ఉండేలా వారు విధుల్లో ఉంటారని ఆమె తెలిపారు. అలాగే ఇసుక అక్రమ రవాణాను అరికట్టేలా చుట్టూ ట్రెంచింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణి అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఆమె విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను అందజేశారు. అనంతరం నాగమణి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన కళాజాత



ప్రియదర్శిని కాలనీలో బాల్య వివాహాలు వద్దంటూ వివరిస్తున్న కళాకారులు

పెదగంట్యాడ : బాల్య వివాహాలు అనర్థాలకు మూలమని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కళాజాత కళాకారులు వివరించారు. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ సెక్టార్ పరిధిలోని ప్రియదర్శిని కాలనీ, దిబ్బపాలెం, దయాళ్‌నగర్ లోవ, దయాల్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, స్థానిక మహిళలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలల హక్కుల చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం గురించి ఆట పాటలతో వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కృష్ణవేణి, శెట్టి పద్మావతి, పి.బేబి, పైడిరత్నం, దేముడమ్మ, ఆయాలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దయాళ్‌నగర్ లోవలో కళాకారుల ప్రదర్శన

ఆనందరావు సేవలు చిరస్మరణీయం



ఆనందరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

అగనంపూడి : న్యూఢిల్లీలోని ఆంధ్రా భవన్ అసిస్టెంట్ కమిషనర్ కందుల ఆనందరావు సేవలు మరువలేనివని ఆలిండియా దళిత రైట్స్ ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాటూరి శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెంలోని ఏఐడీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఆనందరావు జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. దళితుల హక్కుల కోసం రాజీ లేని పోరాటం చేసిన ఆనందరావు లేని లోటు ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐడీఎఫ్ జిల్లా ప్రతినిధులు నందికోళ్ల అప్పారావు, జొన్నకూటి విజయ్‌కుమార్, బి.ఎ.స్వామి, ఆర్.కోటేశ్వరరావు, పట్నాల రాజు, పందిరి ప్రసాద్, గోక సురేష్, కంభంపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో శ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారు



మల్లెపూలు, గులాబీల అలంకరణలో అమ్మవారు

అల్లిపురం : బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయదాతలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని మల్లెలతో అభిషేకించారు. ప్రతి శుక్రవారం జరిగే ఈ పూజలో పాల్గొనే వారు రూ.500 చెల్లించిన యెడల ఈ పూజకు దంపతులను లేక ఇద్దరిని అనుమతిస్తామని ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వి.రాంబాబు తెలిపారు. ఆసక్తి గల వారు 0891–2566514, 8985515989 నంబర్లు, వాట్సాప్ ద్వారా సేవా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన.. కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూరులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి.

రెండు రైతు బజార్లలో పార్కింగ్ కోసం గడువు పెంపు

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతు బజార్లలో ఖాళీ స్థలంలో పార్కింగ్ కోసం ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహణకు ఇచ్చిన గడువు పెంచారు. జులై ఒకటో తేదీ నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలం కోసం తొలుత ఈనెల 28వ తేదీ(శుక్రవారం) నిర్వహించాలని నిర్ణయించారు. వివిధ కారణాల వల్ల ఈ గడువు జులై 5వ తేదీ వరకు పొడిగించారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతు బజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జిల్లా ఇన్‌జార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను శనివారం నుంచి వచ్చేనెల 5వతేదీ మధ్యాహ్నం ఒంటి గంటలలోపు అందజేయాలని, 5న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇవ్వడం జరిగిందని వివరించారు. దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్.నంబరు 8.202/2, ఆర్ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతు బజార్ పక్కన, విశాఖపట్నం–530029ను సంప్రదించాలి. లేదా ఫోన్ 9030819082కు సంప్రదించాలి.

యునిసెఫ్ సమ్మిట్‌కు ఓక్రిడ్జ్ విద్యార్థుల హాజరు



హ్యూస్టన్ సమ్మిట్‌లో పాల్గొన్న ఓక్రిడ్జ్ విద్యార్థులు

తగరపువలస: ఇటీవల హ్యూస్టన్‌లో జరిగిన యునిసెఫ్ సమ్మిట్ ఎన్ఏఈలో భీమిలి మండలం శింగనబంధ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రాతినిథ్యం వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యమైన సమస్యలు చర్చించి పరిష్కారాలు సాధించడానికి జరిగిన ఈ సమ్మిట్‌లో ఓక్రిడ్జ్‌కు చెందిన ఎస్.సూర్యతేజ్, వి.ఆన్యా, బి.స్రుజన్ పాల్గొన్నారు. సమ్మిట్‌లో అద్భుతమైన నాయకత్వం, పట్టుదల ప్రదర్శించారని స్కూల్ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. విద్యతో మొదలుకుని పర్యావరణ మార్పుల వరకు వివిధ అంశాలపై విద్యార్థులు లోతైన చర్చల్లో పాల్గొన్నారని పేర్కొంది. ఈ సమ్మిట్‌లో నార్త్ ఆంగ్లియాకు చెందిన 120 కంటే ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆరు రోజుల పాటు జరిగిన సమ్మిట్‌లో పాల్గొన్న విద్యార్థులను ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల అభినందించారు.

విద్యుత్ షాక్‌తో హెల్పర్ మృతి

గోపాలపట్నం: గోపాలపట్నంలోని ఓ ఆస్పత్రి వద్ద విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తున్న సమయంలో.. కరెంట్ షాక్‌కు గురై హెల్పర్ సిరపురపు శంకరరావు(51) మృతి చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివీ.. సింహాచలం సాయినగర్‌కు చెందిన సిరపురపు శంకరరావు లైన్‌మన్ వద్ద హెల్పర్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ఆస్పత్రి వద్ద విద్యుత్ సమస్య ఉండడంతో.. స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందకు పడిపోవడంతో తీవ్రంగా దెబ్బలు తగిలాయి. వెంటనే అతన్ని బెహరా ఆస్పత్రిలో చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. శుక్రవారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



వెండి ఆభరణం అందిస్తున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. ఎన్ఆర్ఐ భక్తులు మోహన్, పద్మిని 250 గ్రాముల వెండి యగ్నోపవేథానిని స్వామివారికి సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

వైభవోపేతం భువన విజయం



భువన విజయం సాహితీ రూపకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: శ్రీకృష్ణదేవరాయలు కాలంలో అష్టదిగ్గజాలతో భువన విజయం సభ నిర్వహించేవారని పుస్తకాల్లో చదివాం, సినిమాలలో చూసి ఉంటాం. కానీ అప్పటి రాయల వారి వైభవం, ఆహార్యం, కవుల సాహితీ ప్రతిభ, చమత్కారం చూసే భాగ్యం మనకు లేదనే చెప్పాలి. శ్రీలలితాపీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాలలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన అక్కిరాజు సుందర రామకృష్ణంరాజు బృందం ప్రదర్శించిన 'భువన విజయం సాహితీ రూపకం' అప్పటి వైభవాన్ని ప్రేక్షకుల కళ్లకు కట్టినట్టు చూపారు. సభికులను శ్రీకృష్ణదేవరాయల కాలానికి తీసుకువెళ్లేలా రసాస్వాదనకు లోనుచేశారు.డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణరాజు ప్రధాన పాత్రలో శ్రీకృష్ణ దేవరాయలుగా అద్భుతమైన రాజసం, ఆహార్యంతో ఆకట్టుకున్నారు. అలాగే అప్పాజీగా ముదిగొండ శివప్రసాద్, అల్లసాని పెద్దనగా పంద్రప్రగడ శ్రీనివాస్, మల్లనగా భాస్కరభట్ల, అయ్యలరాజుగా కె.చంద్రశేఖరం, పింగళిసూరనగా చౌడూరి నరసింహారావు, నంది తిమ్మనగా మల్లాది వెంకట గోపాలకృష్ణ, ధూర్జటిగా యెల్లం రాజు త్యాగరాజు, భట్టుమూర్తిగా సి.యం.కె.గాంధీ, తెనాలి రామకృష్ణుడిగా మావుదూరు సూర్యనారాయణమూర్తి తమదైన శైలిలో అద్భుత ఆహార్యం, పద్యపఠనంతో అలరించారు. ఈ సందర్భంగా అక్కిరాజు సుందర రామకృష్ణ మాట్లాడుతూ మతసామరస్యన్ని చక్కగా పాటించి ప్రజా సంక్షేమం కోసం సుపరిపాలన అందించిన ఏకైక చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఆ మహా చక్రవర్తి సాధించిన విజయాలను పక్కనపెడితే భాషాపరంగా ఆయన చేసిన కృషి ఆనాటి నుంచి ఈ నాటి వరకు ఏ రాజు, ఏ ప్రభుత్వం చెయ్యలేదనే చెప్పాలన్నారు. అష్ట దిగ్గజ పాత్రధారులు తమదైన అద్భుత ప్రతిభతో దత్తపది, సమస్య పూరణ, వర్ణనలతో సభను రక్తికట్టించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన భువనవిజయం సాహితీ రూపకాన్ని పలువురు భక్తులు, సాహితీవేత్తలు చూసి తరించారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నడిచే దారేది?



ఫుట్‌పాత్‌పై బిర్యానీ వ్యాపారం

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ ప్రాంతంలో వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి నడిచేందుకు వీల్లేకుండా చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమించడం వల్ల పాదచారులు నరక యాతన పడుతున్నారు. చిన్ని చిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా జీవీఎంసీ, ట్రాఫిక్ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంతో పరిస్థితి గాడి తప్పుతోంది. దుకాణ దారులు ఫుట్‌పాత్ ఆక్రమించడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేంటని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కొబ్బరి బోండాల దుకాణాలు, పానీ పూరీ దుకాణాలు, ఫాస్ట్ ఫాడ్ దుకాణాలతో హైస్కూల్ నుంచి బెహరా ఆస్పత్రి వరకు దారిలేని విధంగా ఏర్పాటు చేశారు. కొందరు దుకాణాలు ఉన్నా ఫుట్‌పాత్‌లపైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.